సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

శిష్టకరణ సామాజిక భవన నిర్మాణానికి కృషి

బీచ్ రోడ్డు: శిష్టకరణ సామాజిక భవన నిర్మాణానికి కృషి చేస్తున్నట్టు శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక భవన నిర్మాణ విషయాన్ని శిష్టకరణ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎస్.కె.మహంతి, ప్రధాన కార్యదర్శి ఆరికతోట చంద్రమౌళితో కలిసి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించిందని తెలిపారు.

ఉత్సాహంగా సండే స్పార్క్



చిన్నారుల సండేస్పార్క్ ఆటలు

మద్దిలపాలెం : చిన్నారుల్లో విజ్ఞానం, వినోదం, వికాసం పెంపొందించడానికి వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ సండే స్పార్క్ కార్యక్రమం పిఠాపురం కాలనీలోని ఇంటరాక్ట్ క్లబ్‌లో నిర్వహించారు. సండే స్పార్క్ అంటే ఆట, పాటలతో సైన్స్, కళలు, నైపుణ్యాన్ని పెంచే ప్రక్రియ అని కన్వీనర్ సుశీల తెలిపారు. పిల్లల్లో విజ్ఞానం పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. దీనిలో భాగంగా చిన్నారులను సూర్యుడు చుట్టూ గ్రహాలు తిరిగే పద్ధతి నిల్చోబెట్టి ప్రాక్టికల్‌గా సౌర మండలంపై అవగాహన కల్పించారు. ఇలాంటి ఎన్నో విజ్ఞానంతో కూడిన ఆటలు చిన్నారులకు నేర్పిస్తున్నామన్నారు.

నేడు శ్రీవారి సేవ

ఎంవీపీ కాలనీ: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు శ్రీవారి సుప్రభాత సేవా, అర్చనతో పాటు కల్యాణోత్సవం చేయనున్నారు. 7 గంటలకు తోమాల సేవ, 8.30 గంటలకు కల్యాణం జరగనున్నాయి. కార్తీక దీపోత్సవ బృందం, వైద్య విజ్ఞాన విపంచి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.వి జయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు సీఐ హితవు పలికారు. కార్యక్రమంలో ఉమెన్ ఎస్ఐ ప్రమీల, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి బాపిరాజు



మాట్లాడుతున్న ఆచార్య పాండురంగ విఠల్‌మూర్తి

సీతంపేట: విశాఖ సాహితి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం లలితానగర్ లలితా పీఠంలో అడవి బాపిరాజు 128వ జయంతి సభ నిర్వహించారు. ఆచార్య కె.మలయవాసిని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి ఆచార్య కోలవెన్ను పాండురంగ విఠల్ మూర్తి మాట్లాడుతూ బాపిరాజు రచనలపై తన అభిరుచిని, అధ్యయనాన్ని వివరించారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ బాపిరాజు జీవిత విశేషాలను వివరిస్తూ, కథకుడిగా, నవలా రచయితగా, కళా దర్శకుడిగా బాపిరాజు బహుముఖ ప్రతిభను విశ్లేషించారు. జాతీయవాదిగా ఆయన స్థానం మహోన్నతమన్నారు.

పలకరిస్తూ.. అభయమిస్తూ..

- తూర్పులో వైఎస్సార్‌సీపీకి కొత్తజోష్
- వార్డుల వారీగా ఎంపీ ఎంవీవీ విస్తృత పర్యటనలు
- ప్రజలతో మమేకం.. సమస్యల పరిష్కారానికి పెద్ద పీట



పార్టీ శ్రేణులతో కలిసి అప్పుఘర్ శ్మశానవాటికను పరిశీలిస్తున్న ఎంపీ ఎంవీవీ (పాత చిత్రం)



జాలరిపేటలో చిన్నారిని ఎత్తుకుని ప్రజలతో మమేకమవుతున్న ఎంపీ (పాత చిత్రం)

ఎంవీపీ కాలనీ: తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి కొత్తజోష్ లభిస్తోంది. ఎంపీ, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ వార్డుల వారీగా ప్రజలతో పెద్ద ఎత్తున మమేకం అవుతున్నారు. ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యల పరిష్కారానికి అభయమిస్తున్నారు. నియోజకవర్గ ప్రజల్లో విశ్వాసాన్ని, నమ్మకాన్ని కలిగించే దిశగా ముందుకు సాగుతున్నారు. నియోజవర్గంలో జరుగుతున్న ఏ కార్యక్రమానికైనా ఎంపీ నేరుగా హాజరవుతుండటం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతోంది. పార్టీ శ్రేణులతో సమావేశాలు, వార్డుల వారీగా సమస్యలపై ఆరా, పరిష్కారం దిశగా అడుగులు, కష్టాల్లో ఉన్న ప్రజలకు భరోసా.. ఇలా అన్నింటా ఎంపీ ఎంవీవీ ముందుండి అన్నీ తానై నడిపిస్తుండడం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

సమస్యల పరిష్కారానికి బాటలు

ఆయా వార్డులో జరిగే కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనడంతో పాటు అక్కడి సమస్యలపై ఎంపీ ఎంవీవీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

- జాలరిపేటలో ప్రధాన రోడ్డు నిర్మాణంపై ప్రజలు విజ్ఞప్తులు చేయగా.. ఎంపీ ఎంవీవీ స్పందించారు. తక్షణమే జీవీఎంసీ సిబ్బందిని పిలిపించి రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. వేగంగా ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.
- అప్పుఘర్‌లో శ్మశానవాటిక ఆధునికీకరణ కోసం ప్రజలు విజ్ఞప్తి చేయగా ఎంవీవీ స్పందించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తన ఎంపీ ల్యాండ్స్ నిధుల నుంచి ఈ ప్రక్రియకు అవసరమైన సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.
- 18 వార్డు మూలపాలెంలో రామాలయం నిర్మాణం కోసం స్థానికులు కోరగా.. పూర్తి ఆర్థిక సాయం అందిస్తానని చెప్పారు.
- 15,16 వార్డుల్లో రూ.కోటి చొప్పున నిధులతో బీటీ రోడ్ల నిర్మాణానికి హామీ ఇచ్చారు. జీవీఎంసీతో పాటు ఎంపీ ల్యాండ్స్ నుంచి ఆయా నిధులు కేటాయిస్తూ పనులకు ప్రణాళికలు సిద్ధం చేయిస్తున్నారు.
- వివిధ అనారోగ్య సమస్యలు, ప్రమాదాల కారణంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను ఎంపీ నేరుగా కలుస్తూ వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు.
- నియోజకవర్గ శుభకార్యాలతో పాటు మంచి చెడ్డల్లో పాల్గొంటూ ప్రజలతో మమేకమవుతున్నారు.

సీఎం స్ఫూర్తితో ప్రజా సేవ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని ముందుకు సాగుతున్నాను. అన్ని వార్డుల ప్రజలతో మమేకమవుతూ అక్కడి సమస్యలు, అవసరాలు, కష్టాలు తెలుసుకుంటున్నా. వాటి పరిష్కారం దిశగా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నా. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని, 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపు ఆవశ్యకతను తెలియజేస్తూనే.. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చిన, వార్డుల్లో ఎలాంటి అవసరాలు ఉన్నా వాటిని పరిష్కరించే దిశగా సేవలు అందిస్తున్నాను.

– ఎంవీవీ సత్యనారాయణ, ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఉద్యోగులు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

విజయవాడ సభకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మద్దిలపాలెం వద్ద బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు

మద్దిలపాలెం : విజయవాడలో జరిగే వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సదస్సుకు విశాఖ తూర్పు నియోజకవర్గం నాయకులు ఆదివారం తరలివెళ్లారు. విశాఖ ఎంపీ, పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ఆదేశాల మేరకు నాయకులు ప్రత్యేక బస్సులో వెళ్లారు. మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు.

విద్యతోనే పేదల ఎదుగుదల



మాట్లాడుతున్న జె.బి.రాజు

సీతంపేట: పేదలు ఎదగాలంటే విద్యే మూలమని, ప్రపంచ బ్యాంకు నిబంధనలకు తలొగ్గి పాఠశాలలను మూయవద్దని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో విద్యా రంగ పరిరక్షణపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సేన అధ్యక్షుడు జె.బి.రాజు, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను నాశనం చేసే 117 జీవోను రద్దు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల విలీనం పేరుతో స్కూళ్లు మూసివేయడం విరమించుకోవాలన్నారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు, కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు, వైస్ చైర్మన్ ప్రసాదరావు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండదండలు



సమావేశంలో మాట్లాడుతున్న వాసు

సీతమ్మధార : ఏయూటీడీ–జీవీఎంసీ షెల్టర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం నిర్వహించారు. డైమండ్ పార్కు వాకర్స్ అసోసియేషన్, తెన్నేటి లాఫర్ క్లబ్ సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు మాట్లాడుతూ ప్రతి ఏడాది అక్టోబర్ 10న నిరాశ్రయుల దినోత్సవం జరుపుతున్నట్లు తెలిపారు. దాతలు సమకూర్చిన భోజనం వసతిగృహంలో ఉంటున్న వారికి అందజేస్తూ, రోడ్డుపై ఉంటున్న అభాగ్యులను షెల్టర్‌కు పంపిస్తున్నామన్నారు. తెన్నేటి లాఫర్ క్లబ్ ప్రతినిధి ఐ.టి. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ షెల్టర్లకు కావల్సిన బట్టలు, భోజనం అందిస్తూ తమ వంతు సహకరిస్తున్నామన్నారు. రెండు క్లబ్‌ల తరఫున 80 మంది సభ్యులు నిరాశ్రయులకు అండగా ఉంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డైమండ్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జోగారావు పట్నాయక్, సెక్రటరీ కుమార్, సభ్యులు టి.ప్రసాద్, పి.జనార్దన్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వేద, యోగా, సంగీత సాధనతో ఆనందమయ జీవితం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, వెండి నాణేలు అందిస్తున్న అచ్యుతరామయ్య, సత్యదేవ్

తాటిచెట్లపాలెం: ఆధునిక సమాజంలో వేద, యోగా, సంగీతపరమైన జీవన విధానం వల్ల సంతోషంగా జీవించవచ్చని జగద్గురు పీఠం డైరెక్టర్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంగీత జనకులం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, కంచికామకోటి పీఠం తరఫున వెండి నాణేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఇటీవల కంచికామకోటి పీఠం వారు నగరంలో నిర్వహించిన సంగీత గాన ఝరి కార్యక్రమంలో సంగీత జనకులం విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపారన్నారు. ఈ సందర్భంగా వీరిని ప్రశంసాపత్రాలు, వెండి నాణేలతో సత్కరించినట్లు చెప్పారు. ముఖ్య అతిథి శంకరమఠం కార్యదర్శి టి.అచ్యుతరామయ్య మాట్లాడుతూ కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆదేశంతో జరిపిన సంగీత ఉత్సవంలో నగరంలో సుమారు 2 వేల మంది పాల్గొన్నారన్నారు. ఈ క్రతువులు సంగీత జనకులం పాత్ర విశిష్టమైనదని కొనియాడారు. సంస్థల సమన్వయంతో ఎన్నో సత్కార్యాలను చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జగద్గురు పీఠం తరఫున అచ్యుతరామయ్యను డాక్టర్ సత్యదేవ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జగద్గురు పీఠం కార్యదర్శి బి.ఆర్.కె.రాజు, సంగీత జనకులం అధ్యక్షులు ఇంద్రగంటి కాళీప్రసాద్, ఐ.రమణీప్రసాద్, సంస్థ డైరెక్టర్ బి.ఉషారాణి, బాలభాను విద్యాలయం ప్రిన్సిపల్ ఎస్.వి.శుభశ్రీ, డాక్టర్ బాలగణేష్, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సిహెచ్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఉక్కుపై పోరుకు భెల్ సిటు సంఘీభావం

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ సంఘీభావం తెలుపుతుందని సిటు ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ అన్నారు. ఆదివారం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం దగ్గర జరుగుతున్న 918వ రోజు రిలే నిరాహార దీక్షల్లో భెల్ సిటు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిటు ప్రధాన కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణత్యాగంతో స్టీల్‌ప్లాంట్ స్థాపించబడిందని, ఎన్నో ఉద్యమాలతో ఏర్పడిన ఈ కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించరాదన్నారు. స్టీల్ పోరాటానికి సీఐటీయూ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు.

బ్రహ్మోత్సవాలకు మురళీనగర్ కోలాటం బృందం



బ్రహ్మోత్సవాలకు ఎంపికైన కోలాటం బృందం

మురళీనగర్: తిరుమల తరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కోలాటం ప్రదర్శనకు మురళీనగర్ మహిళా కోలాట బృందం ఎంపికైంది. ఈ బృందంలోని 23 మంది సభ్యులు కోలాటం శిక్షకురాలు రూపా ఆధ్వర్యంలో తమ కళారూపాలను ప్రదర్శిస్తారు. ఈ మేరకు బృంద సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. దేవదేవుడి సమక్షంలో తమకు కోలాటం ప్రదర్శించే అవకాశం రావడం తమ పూర్వ జన్మసుకృతమని ఆనందం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో పందిరి రాట ఉత్సవాలు



12వ వార్డు ఈశ్వరినగర్‌లో పందిరి రాట వేస్తున్న స్థానికులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో దేవి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో సందడి నెలకొంది. ఇందులో భాగంగా జీవీఎంసీ 11, 12 వార్డుల్లో ఆదివారం పలుచోట్ల పందిరి రాట వేశారు. 11వ వార్డు గాంధీనగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన రాట ఉత్సవంలో స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, సంఘం పెద్దలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. 12వ వార్డు ఈశ్వరినగర్‌లో ఎర్ని దుర్గా మహంకాళి నవరాత్రి ఉత్సవాలు కోసం ముహూర్తపు రాటను గురు భవాని కప్ప అభిరామ్ ఆధ్వర్యంలో వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 22న మధ్యాహ్నం అన్నసమారాధన, 24న అమ్మవారికి పసుపు కుంకుమలతో విశేష పూజలు, అభిషేకం, 29న అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

ఏయూ సమాచారం..

ఘనంగా వీఎస్ కృష్ణ జయంతి



వీఎస్ కృష్ణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ఏయూ క్యాంపస్: డాక్టర్ వీఎస్ కృష్ణ జయంతి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయం వద్దనున్న ఆయన విగ్రహానికి గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్థశాస్త్రం ప్రత్యేక అంశంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో వీఎస్ కృష్ణ బీఏ పూర్తి చేశారన్నారు. మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శిగా పనిచేసి 1932లో తనకు ఇష్టమైన విద్యా రంగంలో కృష్ణ ప్రస్థానం ప్రారంభించారని గుర్తు చేశారు. ఏయూలో అర్థశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరిన ఆయన యూజీసీ చైర్మన్‌గా సైతం పని చేశారన్నారు. ఆయన స్మారకంగా గ్రంథాలయానికి డాక్టర్ వీఎస్ కృష్ణ పేరు పెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజగోపాల్, లైబ్రరీ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్స్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొడ్డపాటి రాజుకు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం నుంచి బొడ్డపాటి రాజుకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి ఆయన డాక్టరేట్ ఉత్తర్వులు స్వీకరించారు. విభాగ ఆచార్యులు టి.షారోన్‌రాజు పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ క్వాలిటీ ఎడ్యుకేషన్ ఇన్ సెకండరీ స్కూల్స్ ఆఫ్ విశాఖపట్నం ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అంశంపై జరిపిన పరిశోధనకు రాజుకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఆయనను విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలి



ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పార్వతి రవి, తదితరులు

బీచ్ రోడ్డు: అమర గాయకుడు ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలని ఘంటసాల కోడలు, కళా ప్రదర్శిని డైరెక్టర్ ఘంటసాల పార్వతి రవి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆర్కే బీచ్‌లో ఘంటసాల విగ్రహానికి ఆమె పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాయకుడిగా, సంగీత దర్శకుడిగా, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 18 నెలలు జైలు శిక్ష అనుభవించిన ఘంటసాల భారతరత్నకు అన్ని విధాలా అర్హుడన్నారు. ఆయన సేవలను గుర్తించి భారతరత్న ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, ఎ.ఎస్.జాన్, తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విజయరవీంద్ర తదితరులు

ఎంవీపీ కాలనీ: స్థానిక సమత కళాశాలలో 17వ పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంబీఏ కోర్సు అభ్యసించిన 1994– 2023 మధ్య బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులతో ఈ సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఆచార్య విజయరవీంద్ర మాట్లాడుతూ విజ్ఞానం పొందడం ద్వారానే జీవితంలో విజయ తీరాలకు చేరగలమన్నారు. విద్యార్థులు ఆ దిశగా ముందడుగు వేయాలన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ వాగిర్ సిబ్బందికి అభినందన



ఆస్ట్రేలియా సందర్శనను పూర్తి చేసుకున్న ఐఎన్ఎస్ వాగిర్ సిబ్బంది



వాగిర్ సిబ్బందిని అభినందిస్తున్న ఈఎన్‌సీ సబ్ మెరైన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్

సింధియా: ఆస్ట్రేలియాలోని ఫ్రీమాంటిల్ సందర్శనను విజయవంతంగా పూర్తి చేసుకుని ఆదివారం తిరిగొచ్చిన ఐఎన్ఎస్ వాగిర్ సిబ్బందిని తూర్పు నావికా దళ సబ్‌మెరైన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అభినందించారు. రాయల్ ఆస్ట్రేలియా నేవీతో ద్వైపాక్షిక వ్యాయామాల్లో వాగిర్ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కెప్టెన్ ద్వారా రెండు దేశాల ద్వైపాక్షిక వ్యాయామాలకు సంబంధించిన మరిన్ని విషయాలను రాజేష్ పెంధార్కర్ అడిగి తెలుసుకున్నారు.